ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
కర్ణాటక వార్తలు
సోమవారం 6 అక్టోబరు 2025



9 నుంచి హాసనాంబదేవి దర్శనం 5



హాసనాంబ అమ్మవారి మూలవిరాట్



అష్టకష్టాలు



- కేసులతో ఎమ్మెల్యేలు విలవిల
- కోర్టుల చుట్టూ తిరుగుతున్న 8 మంది
- అధికారపార్టీవారే ఆరుగురు
- బీజేపీ, జేడీఎస్ నుంచి ఒకరు చొప్పున..

బెంగళూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నా వారికి ఆనందం లేదు. సభలో ఉన్నా సంతోషంగా లేరు. దీనికి ప్రధాన కారణం కోర్టుల్లో కేసులే. ప్రస్తుతం అధికారంలో ఉన్నా సంతోషం లేదు..ఏకంగా 8 మంది ఎమ్మెల్యేలు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ఎమ్మెల్యేలంటే నియోజకవర్గానికి మార్గదర్శకుడిగా ఉండాలి. తమ పరిధిలో ప్రజా సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడంతోపాటు శాశ్వతమైన ప్రాజెక్టులు అమలు చేసేందుకు ఎమ్మెల్యేలు కృషి చేయాలి. నియోజకవర్గం పెద్దగా స్థానిక సమస్యలకు అండగా ఉండాలి. ఇవన్నీ ఎమ్మెల్యేల విధానాలంటే ఆ ప్రాంతంలో మార్పు వస్తుంది. కానీ కేసుల భయంతో విలవిలలాడిపోయే పరిస్థితుల్లో కొందరు ఎమ్మెల్యేలు కొట్టుమిట్టాడుతున్నారు. వారి అవినీతి గురించి బహిరంగంగా మాట్లాడుకుంటున్నారు. ఇది తలదించుకునేలాంటి పరిస్థితి అనడంలో ఏమాత్రం సందేహం లేదు. ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా ఎనిమిది మంది కేసులభయంతో కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. వీరిలో ఐదుగురు కాంగ్రెస్‌కు చెందినవారు కాగా ఇద్దరు బీజేపీ, ఒక జేడీఎస్ ఎమ్మెల్యే కూడా ఉన్నారు. సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఆదాయ పన్నులశాఖ, లోకాయుక్త, ఎన్నికల కమిషన్‌ల కేసులలో ఎమ్మెల్యేలు బయట పడే పరిస్థితి లేనంతగా కూరుకుపోయారు. ముగ్గురు ఎమ్మెల్యేలు జైలులో ఉండగా మరో ముగ్గురి సభ్యత్వం న్యాయస్థానం నిర్ణయంపై ఆధారపడింది. అయితే నియోజకవర్గ ప్రజలు మాత్రం అయోమయంలో పడ్డారు.

వినయ్ కులకర్ణి - ధారవాడ



2013 నుంచి వరుసగా కాంగ్రెస్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. 2016లో ధారవాడ జడ్పీ సభ్యుడు యోగేశ్‌గౌడ హత్యకేసులో వినయ్ కులకర్ణి ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. అప్పట్లో కులకర్ణి మంత్రిగా ఉండేవారు. కేసును పోలీసులు నీరుగార్చారనే ఆరోపణలున్నాయి. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడ్డాక యోగేశ్‌గౌడ హత్య కేసును సీబీఐకు అప్పగించారు. దీంతో సీబీఐ కులకర్ణిని అరెస్టు చేసింది. బెయిల్‌పై బయటకు వచ్చినా అతను ధారవాడకు వచ్చే అవకాశం లేదు. ఇటీవలే మరోసారి బెయిల్ పొందినా జూన్ 6న సుప్రీంకోర్టు రద్దు చేయడంతో ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. వినయ్‌కులకర్ణిపై హత్య కేసుతోపాటు బెంగళూరుకు చెందిన ఐశ్వర్య గౌడ పలువురిని మోసం చేసి బంగారు ఆభరణాలను దోచుకున్న వివాదంలో వినయ్ కులకర్ణి భాగస్వామ్యంపై ఈడీ విచారణ జరిపింది.

కేసీ వీరేంద్ర అలియాస్ పప్పి - చిత్రదుర్గ



2023 శాసనసభ ఎన్నికల్లో చిత్రదుర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2016లో చెళ్ళకెరెలోని ఇంట్లో ఐటీ అధికారులు దాడులు చేసి అపారమైన నగదు, ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రకటించిన ఆదాయం కంటే ఎక్కువ ఉన్నట్టు గుర్తించారు. ఇటీవల మరోసారి అతడిపై ఈడీ దాడులు చేసింది. ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యవహారంలో మోసాలకు పాల్పడినట్టు గుర్తించారు. చత్తీస్‌ఘడ్‌లో ఉండగా అక్కడ అరెస్టు చేశారు. ఆయనకు సంబంధించి బెంగళూరు, చిత్రదుర్గతోపాటు పలు చోట్ల దాడులు కొనసాగాయి. కిలోలకొద్దీ బంగారాన్ని గుర్తించారు. గోవాలో కేసినోలను వీరేంద్ర నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం వీరేంద్ర ఈడీ అధికారుల అదుపులో ఉన్నారు. కేసులకు సంబంధించిన విచారణలు కొనసాగుతున్నాయి.

సతీశ్‌శైల్ - కారవార



2013లో ఇండిపెండెంట్ ఎమ్మెల్యేగా గెలుపొందిన సతీశ్‌శైల్ 2018లో బీజేపీ అభ్యర్థి చేతిలో ఓటమి చెందారు. 2023లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచారు. అక్రమ గనుల వివాదంలో చిక్కుకున్నారు. బెళకెరె ఓడరేవులో నిల్వ చేసిన ముడిఖనిజాన్ని గుట్టుచప్పుడు కాకుండా విదేశాలకు ఎగుమతి చేసిన కేసు సతీశ్‌శైల్‌పై నమోదైంది. ఈ కేసులో ప్రజాప్రతినిధుల కోర్టు ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. జైలుకు వెళ్లిన సతీశ్‌శైల్ హైకోర్టును ఆశ్రయించగా తీర్పుపై స్టే విధించారు. బయటకు వచ్చిన వెంటనే ఈసీఐఆర్‌ను నమోదు చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు చేసింది. ప్రస్తుతం ఈడీ అదుపులో ఎమ్మెల్యే ఉన్నారు.

బీ నాగేంద్ర - బళ్ళారి గ్రామీణ



2008లో బీజేపీ నుంచి, 2013లో కూడ్లిగి నుంచి ఇండిపెండెంట్‌గాను 2018లో కాంగ్రెస్ నుంచి బళ్ళారి గ్రామీణ స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2023లో మరోసారి గెలుపొంది మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. మహర్షి వాల్మీకి ఎస్టీ కార్పొరేషన్ నిధులను ఖాతాలు మార్చి దోపిడీకి పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. ఏకంగా 89 కోట్ల రూపాయలు దోపిడీ జరిగినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నిర్ధారించింది. అయితే ఇదే కేసులో సీఐడీ నాగేంద్రకు క్లీన్‌చిట్ ఇవ్వగా ఈడీ మాత్రం ప్రధానసూత్రధారి అతడే అంటూ చార్జ్‌షీట్ దాఖలు చేసింది. నాలుగు నెలలపాటు జైలులో గడిపి ప్రస్తుతం బెయిల్‌పై బయట ఉన్నారు.

కేవై నంజేగౌడ - మాలూరు



2018, 2023 లలో కాంగ్రెస్ తరఫున మాలూరు నుంచి కేవై నంజేగౌడ ఎమ్మెల్యేగా గెలుపు సాధించారు. 2023 ఎన్నికలలో ఓట్ల లెక్కింపులో పొరపాట్లు జరిగాయని బీజేపీ అభ్యర్థి కేఎస్ మంజునాథగౌడ హైకోర్టును ఆశ్రయించారు. ఇటీవల సెప్టెంబరు 15న హైకోర్టు ధర్మాసనం కేవై నంజేగౌడ ఎమ్మెల్యే ఎన్నిక చెల్లదని తీర్పునిచ్చింది. నాలుగు వారాలలో మరోసారి ఓట్ల లెక్కింపు జరపాలని ఆదేశించింది. దీంతో ఓట్ల లెక్కింపులో ఏమాత్రం వాస్తవాలు బహిరంగమైనా నంజేగౌడ ఎమ్మెల్యే హోదా తప్పినట్టే అనిపిస్తోంది.


హెచ్‌డీ రేవణ్ణ - హొళెనరసీపుర



1994 లో జేడీఎస్ నుంచి తొలిసారి గెలుపొందిన హెచ్‌డీ రేవణ్ణ 1999లో ఓటమి చెందారు. ఆ తర్వాత వరుసగా ఐదుసార్లు హొళెనరసీపుర నుంచి గెలుపొందారు. రేవణ్ణ కుమారుడు ప్రజ్వల్ అత్యాచారం కేసులో యావజ్జీవ కారాగారశిక్షకు గురై జైలులో ఉన్నాడు. ప్రజ్వల్ అత్యాచారం చేసిన పని మనిషిని కిడ్నాప్ చేసిన కేసులో రేవణ్ణ కేసును ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం రేవణ్ణతోపాటు ఆయన భార్య బెయిల్‌పై ఉన్నారు. ప్రజ్వల్ కేసును విచారణ జరిపిన సీఐడీ బృందమే రేవణ్ణ కేసును కూడా విచారణ జరుపుతోంది.

జనార్దనరెడ్డి - గంగావతి

గతంలో బీజేపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రిగా కొనసాగారు. ఎమ్మెల్సీగాను వ్యవహరించారు. కొప్పళ జిల్లా గంగావతి నుంచి 2023లో తొలిసారి సొంత పార్టీ నుంచి గెలుపు సాధించినా, ఆ తర్వాత పార్టీని బీజేపీలోకి విలీనం చేశారు. అక్రమ గనుల కేసులో హైదరాబాద్ సీబీఐ స్పెషల్ కోర్టు జనార్దనరెడ్డికి ఈ ఏడాది మే 12న ఏడేళ్ల జైలు విధించింది. దీంతో ఆయన ఎమ్మెల్యే సభ్యత్వం కూడా కోల్పోయినట్టుగా కర్ణాటక శాసనసభ వ్యవహారాలశాఖ కార్యదర్శి ప్రకటించారు. జనార్దనరెడ్డి సీబీఐ కోర్టు తీర్పుపై తెలంగాణ హైకోర్టును ఆశ్రయించి ఊరట పొందారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా కొనసాగే సౌలభ్యం పొందారు. ఈ కేసు నుంచి అంత సులభంగా బయటపడే అవకాశాలు తక్కువే అనిపిస్తోంది.



మునిరత్న - రాజరాజేశ్వరినగర్

2013, 2018లలో కాంగ్రెస్ తరఫున రాజరాజేశ్వరినగర్ నియోజకవర్గం నుంచి గెలుపొందిన మునిరత్న 2019లో గుడ్‌బై చెప్పి బీజేపీలో చేరారు. అక్కడ రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపు సాధించారు. ప్రస్తుతం ఆయన కులదూషణ, హత్యానేరం, అత్యాచార ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. జ్యుడీషియల్ కస్టడీలో కొంతకాలం గడిపి బెయిల్‌పై బయటకు వచ్చారు. ఆయన కేసుల వెనుక రాజకీయ కుట్ర ఉందనే ఆరోపణలు ఉన్నా పలు సాక్ష్యాలు ఉన్నట్టు తెలుస్తోంది. ఇలా 8మంది ఎమ్మెల్యేలు కేసులతో తల్లడిల్లుతున్నారు.



ప్రముఖ సాహితీవేత్త మోగళ్ళి గణేష్ కన్నుమూత



బెంగళూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాహితీవేత్త, విమర్శకులు డాక్టర్ మోగళ్ళి గణేష్(62) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం ఉదయం తుదిశ్వాస వీడారు. నవలా రచయితగానే కాకుండా విమర్శకులుగా గుర్తింపు కలిగినవారు. కన్నడజానపద విశ్వవిద్యాలయం జానపద విభాగం ముఖ్యులుగాను సేవలందించారు. 1963 జూలై1న చన్నపట్టణ తాలూకా సంతమోగనహళ్లిలో జన్మించిన గణేష్ మైసూరు మహారాజ కళాశాలలో అర్థశాస్త్రం చదివారు. అత్యుత్తమ చిన్నకవితల రచయితగానే కాకుండా సూర్యునన్ను బచ్చిడబహుదే నవలతో పాటు బుగరరి, భూమి, దేవరదారి అనే కథా సంకలనాలు, తొట్టిలు కవిత్వం, సొల్లు- సాంస్కృతిక విమర్శ రచనలు ప్రముఖమైనవిగా ఉన్నాయి. ఆదిమ అనే పరిశోధనాత్మక రచనకు గణేష్‌కు డాక్టరేట్ దక్కింది. మోగళ్ళి గణేష్ మృతి పట్ల సాహితీవేత్తలు, రచయితలు, సినిమా రంగానికి చెందిన పలువురు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

భగవాన్ జెండా పేరుతో నూతన పార్టీ 5

: బసవనగౌడ పాటిల్ యత్నాళ్



బసవణ్ణ చిత్రానికి నమస్కరిస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య

అందరికీ ఆదర్శం బసవణ్ణ

- కులం ఏదైనా ఆయన ఆశయాలను సాధించడమే లక్ష్యం
- అందరూ సమానమే అని చాటుదాం : సీఎం సిద్దరామయ్య




బసవసమితి సభలో అభివాదం చేస్తున్న సీఎం సిద్దరామయ్య



సభకు హాజరైన లింగాయతులు

బెంగళూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన కులాలు ఏవైనా మనమంతా శూద్రులమేనని అప్పటికి ఇప్పటికే కాదు భవిష్యత్ తరాలకు బసవణ్ణ తత్వాలు శాశ్వతమైనవని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. బసవసంస్మృతి అభియాన ముగింపు సభ బెంగళూరు ప్యాలెస్ మైదానంలో ఆదివారం జరిగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మందిని ఉద్దేశించి సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ వెనుకబడిన కులాలు వేరుగా ఉండవచ్చునని మనమంతా ఒకే కులమం అన్నారు. ప్రగతి లేకుండా పోతున్న కుల వ్యవస్థను వ్యతిరేకించిన బసవణ్ణ కొత్తమతాన్ని ఆరంభించారన్నారు. సమానత్వం బసవణ్ణ ఆశయమని ఆదే నేను పాటిస్తున్న విధానమన్నారు. బసవణ్ణ అంటే అభిమానమని బసవతత్వాల పట్ల అపార నమ్మకం కలిగి ఉన్నట్లు తెలిపారు. బసవజయంతి రోజునే ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశానని అదే వేదికంగా అందరికీ సమానంగా జీవించే అవకాశాలకు కట్టుబడి ఉన్నట్లు ప్రకటించానని ఆదిశగానే పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. గత ఐదేళ్ళ పాలనలో భాగ్యల పేరిట పేదలకు ఎన్నో సంక్షేమాలు అమలు చేశానని ప్రస్తుతం గ్యారెంటీల పేరుతో పథకాలు కొనసాగిస్తున్నామన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోను బసవణ్ణ ఫోటో తప్పనసరి చేశానన్నారు. కులం ద్వారా ఎవరూ శ్రేష్ఠులు కాలేరని ప్రతిభ, మేధస్సు కూడా ఏ ఒక్క కులానికి సొంతం కాదన్నారు. నేను దరఖాస్తు చేసుకుని కురబ కులంలో పుట్టలేదని కానీ నేను శూద్రుడు అనే కారణం కోసం శిక్షణకు అర్హుడు కాదని పట్టభద్రులైన కొందరి కుట్ర గతంలో సాగిందని ప్రస్తుతం కాదన్నారు. కర్ణాటక సాంస్కృతిక నాయకగా బసవణ్ణను గుర్తించడం ద్వారా ప్రభుత్వం గౌరవించిందన్నారు. కులమత రహిత మానవ సమాజం బసవణ్ణ ఆశయంగా ఉండేదన్నారు. ముందుగా మనమంతా మనుష్యులమని ఆతర్వాత మనమంతా భారతీయులమన్నారు. న్యాయవాద కోర్సు చేస్తున్నప్పటి నుంచి బసవణ్ణ పట్ల ప్రత్యేక అభిమానం ఉండేదన్నారు. బసవణ్ణ చెప్పింది చేసేలాంటి లక్ష్యం కలిగినవారన్నారు. మనం కూడా పాటిస్తేనే నిజమైన బసవణ్ణ అనుచరులమని చెప్పుకునేందుకు వీలుంటుందన్నారు. సమాజంలో నాల్గవ వర్గంగా శూద్రులను చూశారన్నారు. సమాజంలో అసమానత తొలగకుంటే స్వాతంత్ర్య ఆశయాలు నెరవేరవని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అభిప్రాయపడ్డారన్నారు. వచ్చే ఏడాది వచన విశ్వవిద్యాలయం ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. నమ్మ మెట్రోకు బసవ మెట్రోగా ప్రకటించే విషయమై కేంద్రప్రభుత్వానికి ప్రత్యేక నివేదిక పంపుతామన్నారు. సమావేశంలో సిద్దలింగస్వామీజీ, మాదార చెన్నయ్య, బాల్కి బసవలింగ పట్టదేవరు. గదగ్ జగద్గురు, సానేహళ్ళి పండితారాధ్య స్వామీజీ, నిష్కళ మఠ నిజగుణానంద స్వామీజీ, బసవమంటప గంగామాతాజీ, కూడలసంగమ బసవజయ మృత్యుంజయస్వామి, చిత్రదుర్గద బసవశరణకుమార స్వామీజీలతోపాటు 301 మంది శరణులు, గురువులు, స్వామీజీలు భాగస్వామ్యులయ్యారు. కార్యక్రమంలో మంత్రులు ఎంబీ పాటిల్, శరణప్రకాష్ పాటిల్, లక్ష్మీహెబ్బాళ్కర్, కేహెచ్ మునియప్పతో పాటు పలువురు ప్రముఖులు భాగస్వామ్యులయ్యారు.



నేడు బెంగళూరుకు పవన్ కల్యాణ్

- మధ్యాహ్నం చింతామణి.. సాయంత్రం విధానసౌధకు..
- భారీ సభకు ఏర్పాట్లు
- 1500 మంది పోలీసులతో బందోబస్తు

చింతామణి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో ఏపీ డీసీఎం పవన్‌కల్యాణ్ ఒకరోజు పర్యటనకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం చింతామణిలో జరిగే సభలో పాల్గొనే పవన్‌కల్యాణ్ సాయంత్రం విధానసౌధలో జరిగే కార్యక్రమంలోను భాగస్వామ్యులవుతారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తి వి. గోపాలగౌడ 75 జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలలో పాల్గొనేందుకు పవన్‌కళ్యాణ్ వస్తున్నారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో బెంగళూరు హెచ్‌ఎఎల్ విమానాశ్రయానికి పవన్‌కల్యాణ్ 9.40గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలీక్యాప్టర్ ద్వారా చింతామణి పట్టణానికి వెళతారు. .పట్టణ శివారులోని మునగనహళ్ళి గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్నసంద్ర గ్రామంలో ఏర్పాటు చేసిన వేదికకు చేరుకుంటారు. కేంద్రమంత్రి సోమణ్ణ ఇదే కార్యక్రమంలో భాగస్వామ్యులవుతారు. అక్కడే మధ్యాహ్నం రెండుగంటల దాకా ఉంటారు. అనంతరం నేరుగా హెలీక్యాప్టర్‌లో హెచ్‌ఎఎల్ విమానాశ్రయానికి చేరుకుని రేస్‌కోర్సు రోడ్‌లోని ఓ హోటల్‌లో విశ్రాంతి తీసుకుంటారు. విధానసౌధ బ్యాంక్వెట్ హాల్‌లో జరిగే మాజీ న్యాయమూర్తి గోపాల్‌గౌడ జన్మదిన వేడుకలలో సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎంఎన్ వెంకటాచలయ్య, లోకాయుక్త మాజీ న్యాయమూర్తి సంతోష్‌హెగ్డేతో పాటు పలువురు ప్రముఖులు భాగస్వామ్యులవుతారు. ఇదే కార్యక్రమంలో డీసీఎం పవన్‌కళ్యాణ్ పాల్గొంటారు. రాత్రి 8గంటల దాకా కార్యక్రమం జరుగనుంది. ఇలా పవన్‌కళ్యాణ్ ఒకే రోజున రెండు సభలలో పాల్గొంటున్నందున ఇటు చింతామణితో పాటు బెంగళూరులోను భారీగా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. పవన్‌కళ్యాణ్‌కు బెంగళూరుతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో అభిమానులు ఎక్కువగా ఉన్నారు. దీంతో చింతామణి సభలో పాల్గొనేవారికి 30వేల పాసులను మంజూరు చేశారు. ఏకంగా 1500ల మంది పోలీసులను బందోబస్తు నియమించారు. పాసులు లేకుంటే సభా ప్రాంగణంలోకి అనుమతించరాదని పోలీసులు నిర్ణయించినట్లు ప్రకటించారు. కాగా విధానసౌధలో కార్యక్రమానికి కూడా బందోబస్తు పెంచారు. ఆహ్వానితులతో పాటు గుర్తింపు కార్డులు కలిగిన వారికి మాత్రమే విధానసౌధలో ప్రవేశం ఇవ్వదలచారు. బ్యాంక్వెట్ హాలుకు వచ్చేవారికి ప్రత్యేకంగా పాసులు ఇవ్వదలచినట్లు సమాచారం. పవన్ కళ్యాణ్ ఇటీవల విధానసౌధ ప్రాంగణం నుంచి కుమ్కీ ఏనుగులను స్వాధీనం చేసుకునే ప్రక్రియ వేళ గందరగోళ జరిగిన నేపథ్యంలో బందోబస్తు పెంచదలచారు. తొక్కిసలాట జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచనున్నారు.



బహిరంగ సభకు సిద్ధమైన వేదిక



బందోబస్తు ఏర్పాట్లలో పోలీసులు

కొంపముంచిన ఓవర్‌టేక్

- బస్సును తప్పించబోయి కారుకు ప్రమాదం
- ముగ్గురు దుర్మరణం.. ఇద్దరి పరిస్థితి విషమం

బెంగళూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : తుమకూరు నగర శివారులో కేఎస్ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసే కారు ప్రమాదానికి గురికాగా ముగ్గురు దుర్మరణం చెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. బెళధర వద్ద శనివారం రాత్రి ప్రమాదం జరిగింది. కారులో ప్రయాణిస్తున్న కొరటగెరె తాలూకా కత్తినాగేనహళ్ళి శివకుమార్(28), గోవిందప్ప(60), బైచాపుర శివశంకర్(28)లు అక్కడికక్కడే మృతి చెందారు. కత్తినాగేనహళ్ళి గ్రామ నివాసి గోపాల్(28), రెడ్డిహళ్ళి శంకర్(28)లు తీవ్రంగా గాయపడ్డారు. వారిని తుమకూరు ఆసుపత్రికి తరలించారు. కాగా కారులో వీరంతా ధర్మస్థళకు వెళ్తుండగా ప్రమాదానికి గురైనట్లు తెలిసింది. బస్సును ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో కారు ఢీకొట్టింది. బస్సు ముందు భాగం దెబ్బతింది. అయితే బస్సులో ప్రయాణీకులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు, బస్సు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1,632.00
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	14,467	13,865
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	13,955	13,625
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	101.77



దెబ్బతిన్న కారు

డివైడర్‌ను ఢీకొన్న కారు

● బాలుడి మృతి.. ఆరుగురికి గాయాలు

బళ్లారి సిటీ, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): డివైడర్‌ను కారు ఢీ కొన్న ప్రమాదంలో బాలుడు మృత్యువాత పడగా ఆరుగురు గాయపడ్డారు. ఆదివారం మధ్యాహ్నం కూడ్లిగి తాలూకాలోని బసవికల్లు గ్రామ శివారుల్లోని హైవే 50పై మంత్రాలయం నుంచి బెంగళూరు వైపు వెళుతున్న కారు అదుప ుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టడంతో 3సంవత్సరాల బాలుడు అక్కడికక్కడే మృతి చెందగా, ఆరుగురు వ్యక్తులు గాయపడ్డారు. గాయపడ్డవారిని కూడ్లిగి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం బళ్లారి విమ్స్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

దెబ్బతిన్న పత్తి పంట



తెగుళ్లు సోకిన పత్తి పంట

కంప్లి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఎడతెరపిలేకుండా కురిసిన వర్షాలకు పత్తిపంటలు నష్టపోతాయి. కంప్లి, కురుగోడు, హోస్పేట, సండూరు తాలుకాలో పత్తి పంటలు అధిక వర్షాభావానికి పంటలు పూర్తిగా నష్టపోయాయి. పెట్టిన పెట్టుబడులు కూడా ఎదురవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉప్పరహళ్లి, ధర్మసాగర, గాదుగనూరు, భూనళ్లి, సింధిగేరి, బైలూరు తదితర గ్రామాల్లో పత్తిపంటలు పూర్తిగా వర్షానికి దెబ్బతిన్నాయి. రేపో మాపో ఓ పంటలను కోసే సమయంలో వర్షం రావడంతో విరగకాచిన పత్తి పూర్తిగా నెలపాలైంది. లక్షల్లో పంటలకు పెట్టుబడులు పెట్టామని రైతులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. ఈ వర్షం కారణంగా పంటలు పూర్తిగా నష్టపోయి బ్యాంకులు ఇతర వారితో తెచ్చిన డబ్బులు కట్టలేక ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడిందని తెలుపుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు, అధికారులు నష్టపోయిన పంటలను సర్వే చేసి రైతులకు నష్టపరిహారం కల్పించాలని కోరారు.

ప్రైవేట్‌కు పండగే..!

● సెలవులతో భారీగా పెరిగిన బస్సుచార్జీలు ● మూడింతలు పైకి.. ● సామన్యుడి జేబుకు చిల్లు



బళ్లారి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రైవైట్ బస్సు ఆపరేటర్లకు దసరా పండుగ కాసుల వర్షం కురిపిస్తోంది. పండుగ పూట వివిద మహనగరాల నుండి రాకపోకలు సాగించే ప్రయాణికుల అవసరం చూసుకుని ప్రైవేటు బస్సుల యాజమాన్యం రింగ్ అయి రేట్లు విపరీతం పెంచారు. ప్రభుత్వం నడిపే బస్సులు ప్రయాణికులకు సరిపడు విదంగా లేకుండా పోవడం ఒకటైయితే ఇక ప్రైవేటు బస్సుల నడిపే యాజమాన్యం చెప్పిందే రేటు అన్నట్లు వ్యవహరిస్తున్నరు. బళ్లారి, విజయనగర, రాయచూరు. కొప్పళ, చిత్రదుర్గం అలా అనేక ప్రాంతాల నుండి ఇతర రాష్ట్రాలకు బస్సులు నడుస్తున్నాయి. హైదరాబాద్, ముంబాయి. చెన్నై. బెంగళూరు. మంగళూరు, మైసూరు. విజయవాడ లాంటి నగరాలకు బస్సు రేట్లు విపరీతంగా పెంచారు. హైద్రాబాద్ కు మాములు సమయంలో స్లీపర్ బస్సులో ఒక సీటుకు రూ. 750 వరకూ ఉండేది. ఈ మూడు రోజుల నుంచి ఏకంగా రూ. 2200 పెరిగింది. ఇక మంగళూరుకు అయితే రూ. 800 వరకూ ఉండేది. ఇప్పుడు 1800 లకు పెరిగింది. ఇక చెన్నైకు రూ. 800 నుంచి 2500 పెరిగింది. తిరుపతి ఇలా అన్ని రూట్లులో బస్సుల చార్జీలు విపరీతంగా పెంచారు. దసరా పండుగ, వరుసగా సెలవులు రావడంతో కారణంగా పట్టణాల్లో ఉద్యోగాలు, ఐటీ సెక్టార్‌లో జాబ్స్ చేసేవారు. చదువుకునే విద్యార్థులు ఎక్కువగా సొంతూర్లకు వచ్చి తిరిగి వెల్లుతున్నారు. ఈ నేపత్యంలో రైల్లు, బస్సులు ప్రయాణికులతో కిటకిట లాడిపోతున్నాయి. ప్రయాణికుల రద్దీ దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ, సర్కారు బస్సులు సక్రమంగా లేకపోవడంతో ప్రయాణికులు ప్రైవేటు ట్రావెల్స్ మీదే ఆదారపడే పరిస్థితి ఉంది. ఇక ప్రైవేటు ట్రావెల్స్ నిర్వహకులు రింగ్ అయి అన్‌లైల్‌లో రేట్లు ఫిక్స్ చేసి డిమాండ్ క్రియేట్ చేస్తున్నారు. అన్‌లైన్ రేటింగ్ అంటూ ఈరోజు బస్సు టికెట్ రేటు పెరిగిందని గంటగంటకూ పెంచుతూ పోతున్నారు. సెలవుల పై పండుగకు వచ్చిన వారు తిరిగి విధులకు, లేదా క్లాసులకు జాయిన్ కావాలనే ఉద్దేశంతో సరే అని అన్‌లైన్‌లో ఉండే రేటుకే టికెట్ కొంటున్నారు. కొందరు ఎందుకు ఇంత రేటు మెన్నటి వరకూ వంద ఉండేది ఇప్పుడు ఏకంగా మూడు వందలు అంటే మూడింతలు పెంచారు ఎందుకు అని ట్రావెల్స్ ఓనర్లను ప్రశ్నిస్తున్నారు. అన్‌లైన్‌లో కూడా బస్సుల చార్జీల పేరుతో దోపిడీ అని కూడా కామెంట్లు చేస్తున్నారు. చాలా మంది ఇవి బస్సుల చార్జీలా లేదా విమానం చార్జీనా ఇంతక ముందు ఇక్కడి నుండి చెన్నైయ్‌కు వెల్లాలంటే విమానంలోనే రూ. 3వేలు ఉండేది ఇప్పుడేంటి బస్సుకే రూ. మూడు వేలు చార్జీ పెంచారు అని ప్రయాణికులు వాపోతున్నారు.. కొందరు ఒకట్రెండురోజులు లేట్‌గా పోదాములే అప్పుడు చార్జీలు తగ్గుతాయని డ్రాప్ కాగా చాలా మంది ఇప్పటికే చాలా రోజులు అయింది. నోలిప్స్ అని పెరిగిన బస్సుల రేట్లతోనే ప్రయాణిం చేస్తున్నారు. మొత్తం మీద పండుగ పూటే కదా మాకూ నాలుగు డబ్బులు వచ్చేది, మిగిలిన రోజుల్లో ఖాళీగా నడుపుతూ నష్టపోతామని బస్సుల ఓనర్లు అంటున్నారు. మొత్తం మీద బస్సుల చార్జీలు విపరీతంగా పెంచడంతో ప్రయాణికులకు అదనపు బారంగా మారింది.

సర్వే గడువు పదిరోజులు పెంచాలి: అహింద వేదిక



సమావేశంలో మాట్లాడుతున్న వేదిక అధ్యక్షుడు బుడ్డి బసవరాజ్

బళ్లారి సిటీ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): శతాబ్దాలుగా రిజర్వేషన్ల వల్ల మోసపోయిన వర్గాలకు ప్రస్తుతం జరుగుతున్న సర్వే ఒక వరం లాంటిందని, దీనిని పరిపూర్ణంగా పూర్తి చేయడానికి పది రోజులు గడువు పెంచాలని విజయనగరం జిల్లా అహిందవేదిక ప్రభుత్వాన్ని కోరింది. ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో వేదిక అధ్యక్షుడు బుడ్డి బసవరాజ్ మాట్లాడుతూ ఈ సర్వే ద్వారా అందరికీ న్యాయం జరగనుందన్నారు. ప్రస్తుతం విజయనగరం జిల్లాలో 65శాతం సర్వే పూర్తయిందని, మరో రెండు రోజుల్లో వంద శాతం పూర్తి చేయలేమన్నారు. గడువు మరో పది రోజుల పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో వేదిక ప్రధాన కార్యదర్శి శాంతమనేని సోమశేఖర్‌మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు సర్వేను అడ్డుకుంటున్నప్పటికీ ప్రభుత్వం తన సాహసోపేతమైన నిర్ణయానికి కట్టుబడి ఉండటం అభినందనీయమన్నారు. సర్వే తర్వాత రేషన్ కార్డులు రద్దు అవుతాయని ఆందోళన చెందడంలో అర్థం లేదని, ఇలాంటి పుకార్లు వ్యాప్తి చేసే వారి మాట వినకూడదన్నారు. మైనార్టీ సంఘం నాయకుడు సిద్దాం మాట్లాడుతూ.. సర్వేకు పూర్తిగా సహకరించాలని కోరారు. హాలు మత సమాజ్ నాయకుడు రవికుమార్ మాట్లాడుతూ సర్వే గురించి తప్పుదారి పట్టించేవారి పట్ల జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఈసందర్భంలో శివశంకర్,బానాడ ప్రశాంత్, అల్తాప్ మకందర్,ఈరన్న తదితరులున్నారు.

నెలకోసారి వైద్య పరీక్షలు తప్పనిసరి



మాట్లాడుతున్న వైద్యుడు అజయ్‌కుమార్

సిరుగుప్ప, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు నెలకొకసారి ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని జిల్లా ప్రభుత్వాస్పత్రి వైద్యులు అజయ్ కుమార్ తెలిపారు. ఆదివారం సిరుగుప్ప గాయత్రీ విద్యామందిర్‌లో ఉచిత ఆరోగ్య పరీక్ష శిబిర కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన డాక్టర్ అజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు ప్రతిరోజు పనిఒత్తిడి వల్ల బీపీ, షుగర్, సీజనల్ వ్యాధులు సోకడం సాధారణం. వీటన్నింటికి నియంత్రణలో వుంచేందుకు ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి అని తెలిపారు. కార్యక్రమంలో మహమ్మద్ ఖాసీమ్, నాగప్రియ, ప్రభుత్వాస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

జనావాసాల్లోకి చిరుత

కంప్లి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని మునిరాబాద్‌లో జనసాంద్రత ప్రాంతమైన ఇంద్ర సర్కిల్ సమీపంలో శనివారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో చిరుత సంచారంతో స్థానికులు బెంబేలెత్తారు. చిరుతను చూసిన వెంటనే ప్రజలు పరుగులు తీశారు. ప్రజలను బయటికి వెళ్లాలన్నా భయాందోళనకు గురవుతున్నారు. ఇంద్ర భవన్ గెస్ట్ హౌస్‌కు వెళ్లి తరువాత పక్కనే ఉన్న పంపావన్ పార్క్ గేటు దూకి లోపలికి ప్రవేశించిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఆర్‌ఎఫ్‌వో జోనల్ ఫారెస్ట్ ఆఫీసర్ స్వామి తెలిపారు. వెంటనే భూమి ఏర్పాటు చేసి చిరుతను బంధించి ప్రజలకు భయభ్రాంతుల నుంచి విముక్తి కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



పంపావన వద్ద కనిపించిన చిరుత అడుగులు

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ధర్మవరం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కదులుతున్న రైలును ఓ వ్యక్తి ఎక్కబోయి కాలుజారి రైలుకిందపడి మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి ధర్మవరం రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. రైల్వేపోలీసులు తెలిపిన మేరకు చిలమత్తూరు మండలం మొహరం గ్రామానికి చెందిన కమలాకర్(40) అనే వ్యక్తి హిందూపురం రైల్వేస్టేషన్ నుంచి కాచిగూడా రైలు ఎక్కాడు. రైలు ధర్మవరం రైల్వేస్టేషన్‌లో ఆగింది. కమలాకర్ వాటర్ బాటిల్ కోసం రైలు దిగాడు. ఈలోపు రైలు కదలడంతో వెళ్లిపోతుందన్న ఆతృతతో రైలు ఎక్కేందుకు ప్రయత్నించి ప్రమాదవశాత్తు కాలుజారి రైలు కిందపడి అకడికక్కడే మృతిచెందాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కొప్పళలో నేడు జనస్పందన

● హాజరుకానున్న సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే



మాట్లాడుతున్న మంత్రి శివరాజ్ తంగడిగి

బళ్లారి,అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కొప్పళ జిల్లా కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ ప్రభుత్వం 'జనస్పందన' కార్యక్రమం నిర్వహించనుంది. ఈ కార్యక్రమంలో సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ లతో పాటు వివిద శాఖ మంత్రులు హాజరవుతున్నారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి శివరాజ్ తంగడిగి తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 28 నెలలు కావస్తుందని, ఇప్పటి వరకూ సీఎం, డీసీఎం ఇక్కడ సభల్లో పాల్గొనలేదన్నారు. తొలిసారి కొప్పళకు రావడం విశేషమన్నారు. జిల్లాలోని 5 నియోజకవర్గాల నుంచి లక్షల మంది జనం కదిలిరావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇంతకాలం ప్రజలకు అందించిన పథకాలు, లబ్దిదారులకు చేసిన మంచి పనులు తదితర అంశాలపై సభలో చర్చించనున్నారన్నారు. భారీ సభకు ఏర్పాట్లు ముమ్మరంగా చేపట్టనున్నారు.

బస్సు షెల్టర్ లేక ప్రయాణికులకు కష్టాలు



బస్సుల కోసం ఎండలో వేచి ఉన్న ప్రయాణికులు

బళ్లారి సిటీ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కురుగోడు పట్టణంలో బస్సుల కోసంవేచి ఉండే ప్రమాణీకులు షెల్టర్ లేక ఇబ్బంది పడుతున్నారు. మహిళలు, వృద్ధులు సైతం ఎండ,వాన గాలిని లెక్కచేయకుండా రోడ్డుపైనే వేచి ఉండాల్సివస్తుంది. బళ్లారి వెళ్లే బస్సులను దుకాణాల ముందు కానీ, డ్రైయిన్లపై కూర్చుని లగేజీలతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రయాణీకులను ఎక్కించుకోవడానికి నియమించిన ప్రదేశాలలో బస్‌స్టాప్‌లు లేక పోవడంతో బస్సులు ప్రదాన రౌండ్ చుట్టు ఆగుతాయి. వాహనాలు ఎక్కడిక్కడ నిలిచిపోవడంతో ట్రాఫిక్ రద్దీపెరిగుతుందని తగిన పరిష్కారం చేకూర్చాలని ప్రజలు వాపోతున్నారు.

ఘనంగా వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ప్రసన్నానందపురి స్వామీజీ

బళ్లారిరూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని సిడిగినమల గ్రామంలో ఆదివారం వాల్మీకి ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. వాల్మీకి గురూజీ ప్రసన్నానందపురి స్వామీజీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎడీహళ్లి సర్కిల్ నుంచి వాల్మీకి గురూజీకి యువకులు పెద్దఎత్తున స్వాగతం పలికారు. బైకు ర్యాలీ నిర్వహించి సన్మానించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ ఎస్టీ వాల్మీకి విద్యార్థులను తమ తల్లిదండ్రులు మంచిగా చదివించాలని, మంచి భవిష్యత్తునివ్వాల పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి ప్రముఖులు ఓంకార్ నాయుడు, భీమలింగ, వీకే బసప్ప, మీనళ్లి తాయన్న, హగరి శీన, జోళదరాసి తిమ్మప్ప, పీడీ హళ్లి జనార్దన్ నాయక్, ముద్దమల్లయ్య, గ్రామ పంచాయతీ అధ్యక్షుడు సుజాత, తాయన్న, రుద్రయ్య, చెన్న బసన్నగౌడ, శివరాజ్, సుంకన్న, అన్న నాగరాజు, తిప్పేరుద్ర గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

సొంత పనులకు ప్రభుత్వ వాహనం

● దుర్వినియోగంపై ఈఓను ప్రశ్నించిన కేఆర్ఎస్ కార్యకర్త



ప్రశ్నిస్తున్న కేఆర్ఎస్ కార్యకర్త మహేష్

కంప్లి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కారును సొంత పనులకు వాడుకోవడంపై కేఆర్ఎస్ కార్యకర్త నిలదీశారు. కురుగోడు తాలుకా ఈఓ నిర్మల ప్రభుత్వ కారును వ్యక్తిగతంగా ఉపయోగించుకునే వీడియో వైరల్ అయ్యింది. బళ్లారి నుంచి మైసూరుకు ఈఓ భర్త హనుమంతప్ప కుటుంబ సభ్యులతో వెళ్తుండగా చెళ్లకెర వద్ద కేఆర్ఎస్ పార్టీ కార్యకర్త మహేష్ కారును ఆపి ప్రశ్నించారు. ఈఓ నిర్మలను ఫోన్ చేసి అడగ్గా తొలుత రేపేర్‌కు ఇచ్చామని బుకాయించింది. అనంతరం తప్పు జరిగినట్లు ఒప్పుకుంది. వెంటనే తమ భర్తకు ఆ కారును తిరిగి తీసుకురమ్మని ఫోన్ చేస్తానంది. ప్రభుత్వ కారును వ్యక్తిగతంగా వాడుకోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కర్మాగారాలతోనే నదులు కలుషితం: పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న బసవరాజు పాటిల్

కంప్లి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఫ్యాక్టరీల వల్లే జలాశయంలోను తుంగభద్ర నదిలోను నీరు కలుషితమవుతోందని రాష్ట్రీయ స్వాభిమాన ఆందోళన సమితి జాతీయ అధ్యక్షులు బసవరాజు పాటిల్ తెలిపారు. ఎగువ కర్మాగారాలు, ఇతర వనరుల నుండి వచ్చే కలుషిత నీటితో తుంగభద్ర నది కలుషితమవుతోంది. ప్రజలు ఇప్పుడు మేల్కొనకపోతే రాబోయే రోజుల్లో వారు పెద్ద వ్యాధుల బారిన పడవలసి వుంటుందని తెలిపారు. కావున నదిని కాపాడటానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలన్నారు. న్యూడిల్లీలోని రాష్ట్రీయ స్వాభిమాన ఆందోళన సమితి జాతీయ అధ్యక్షులు బసవరాజు పాటిల్ వీరాపుర తెలిపారు. న్యూడిల్లీ రాష్ట్రీయ స్వాభిమాన ఆందోళన, పర్యావరణ ట్రస్టు శివమొగ్గ, బళ్లారి, కొప్పాళ నిర్మూలన తుంగభద్ర అభియాన్ సమితి ఆదివారం పట్టణంలోని సంగాత్రేయ సంస్కృత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన స్వచ్చత నిర్మూలన తుంగభద్ర అభియాన్ పాదయాత్ర మూడవ దశ సంప్రదింపులు సమావేశంలో ఆయన మాట్లాడారు. తుంగభద్ర నది పూర్తిగా కలుషితమయ్యే అవకాశం వుందన్నారు. తుంగభద్ర నది మూడు భాగాలలో వేర్వేరు సమస్యలు ఉన్నాయి. జలాశయం నుండి వేర్వేరు సమస్యలు ఉన్నాయి. జలాశయం నుండి రాయచూరు వరకు వేరుషేపేయుఉ ఎదుర్కొంటున్నాయి. ఎగువ కర్మాగారాల నుండి వచ్చే విషపూరిత నీరు పొలాలలో రసాయనాల వాడకం నది నీటిని కలుషితం చేస్తున్నాయి. ప్రజలలో క్యాన్సర్ కేసులను పెంచుతున్నాయి. కావున మనం ఇప్పుడే మేల్కొనకపోతే రాబోయే రోజుల్లో మనం చాలా కష్టతరమైన రోజులను ఎదుర్కొంటామన్నారు. ఇక్కడ కలుషితమైన నీటిని తీసుకోవడం వల్ల మానవులలో వివిధ వ్యాధులు స్థిరపడతాయి కావున ప్రజలు ఇప్పటి నుండి నదిలోకి వచ్చే కలుషిత నీటిని ఆపాలి. దీని కోసం పోరాటం అత్యంత ముఖ్యమైనది. దీని కోసం కిష్కింద నుండి మంత్రాలయం వరకు మూడవ దశ పాదయాత్ర ద్వారా సమావేశాలు జరుగుతున్నాయి. ఇటువంటి సమావేశాలు పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొని నదిని కాపాడటానికి ముందుకు రావాలన్నారు. ఇక్కడ జరిగిన సమావేశంలో నదిని కాపాడే అంశంపై సమావేశంలో కొంతకాలం చర్చించారు. ఈ సమావేశంలో సీపీ జాతీయోద్యమ సౌత్ ఇండియా కోఆర్డినేటర్ మాధవన్, మాజీ ఎమ్మెల్యే మహిమా పటేల్, రాజమాత, శ్రీరంగదేవ రాయలు, రాఘవేంద్ర, తుంగభద్ర యోర్షి, రామకృష్ణ, ఏసీ దానప్ప, ఎస్‌ఎం నాగరాజు, జంబునాథ్‌గౌడ, శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖర్, వాగీష్, మహమ్మద్ సాహెబ్, రంగప్ప, ఆదోని నాగరాజు, డాక్టర్ శివ కుమార్, డాక్టర్ తిమ్మప్ప నాయక, కేఎస్ దొడ్డ బసప్ప, టీ గంగన్న, కే సుదర్శన్, రవీంద్ర తదితరులు ఉన్నారు.

ఘనంగా మహబూబ్ సుబానీ గ్యార్మీ వేడుకలు



ప్రార్థనలు నిర్వహిస్తున్న భక్తులు

సిరుగుప్ప, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మహబూబ్ సుభాన్ గ్యార్మీ ఆదివారం కనుల పండువగా జరిగింది. సిరుగుప్ప పట్టణం సింధనూరు రోడ్డుమార్గంలో ఇబ్రహీం మంజిల్‌లో గ్యార్మీ వేడుకలు జరిగాయి. ఈద్గా కమిటీ మాజీ అధ్యక్షులు హాజీ అబ్దుల్ నబీ ఆధ్వర్యంలో అల్లాను ప్రార్థించి వేడుకలు నిర్వహించారు. అన్నదాన సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అబ్దుల్ నబీ మాట్లాడుతూ.. శాంతి మార్గంలో నడవాలని ఆయన కోరారు. అల్లాను ప్రార్థించడం వలన మనిషి జ్ఞానాభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మహమ్మద్ రఫీ, ఇబ్రహీం, మహమ్మద్ నౌషద్ అలీ, ముస్లింలు పాల్గొన్నారు.

సిద్ధేశ్వర స్వామికి పూజలు

అమరాపురం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలసిన హెంజేరు సిద్ధేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్ తెలిపారు. సుప్రభాతసేవతో మొదలై కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. సిద్ధేశ్వరస్వామికి, దొడ్డేశ్వరస్వామికి, మల్లేశ్వరస్వామికి, విరూపాక్షి స్వామిని ప్రత్యేకంగా వెండి కవచాలు ధరింపజేసి ప్రత్యేకంగా అలంకరించారు.



విద్యార్థులు చెస్‌పై ఆసక్తి పెంచుకోవాలి

● తిరుమల పాఠశాల అధినేత యల్లప్ప

బళ్లారిరూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మొబైల్‌ఫోన్ వదిలేసి చెస్‌పై ఆసక్తిని పెంచుకోవడం వల్ల మీ తెలివితేటలు పెరుగుతాయని మనసుకు ఏకాగ్రత వస్తుందని తద్వారా మీ చదువులో విజయం సాధించవచ్చునని తిరుమల స్కూలు కరెస్పాండెంట్ యల్లప్ప సూచించారు. బళ్లారి తాలుకా గోడేహాళ్ వద్ద ఉన్న తిరుమల స్కూలు ఆవరణంలో ఎడ్యుకేషనల్ ట్రస్టు సంయుక్తంగా ఆదివారం బ్రెయిన్ ఫోర్స్ చెస్ 2025 అండర్ 16 ఓపెన్ కరెస్పాండెంట్ ఆయన ప్రారంభించారు. ఆధునిక హైటెక్నాలజీతో రాకెట్లతో తిరుగుతున్న వ్యక్తులు మోబైల్ ఫోన్లపై ఆసక్తిని పెంచుకోవడం ద్వారా తమ విలువైన సమయాన్ని, వయసును వృథా చేసుకుంటున్నారన్నారు. విద్యార్థులు ఇటీవల మొబైల్ ఫోన్లకు బానిసలుగా మారారన్నారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు తమ తెలివితేటలను పెంపొందించుకోవడానికి క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. ముఖ్యంగా విధులకు మేలు చేసే చెస్ పట్ల విద్యార్థులు 8, 10, 12, 14, 16 సంవత్సరాలలోపు విద్యార్థులు సుమారు 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 8 నుంచి 16 సంవత్సరాలలోపు బాలురు, బాలికలు మొత్తం ఐదు బ్యాచులకు ప్రతి బ్యాచ్‌లో మొదటి రెండవ మూడవ నుండి 5 వరకు సర్టిఫికెట్లు పతకాలు, ట్రోఫీలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బళ్లారి చెస్ ఛాంపియన్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ప్రవీణ్, జిల్లా అధ్యక్షులు వీరభద్రయ్య, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు ప్రకాష్, తిరుమల హైస్కూలు ప్రధానోపాధ్యాయులు నాగరాజు, ప్రమోద్ రాజు, జగదీష్, ఎస్ఎస్ఎండీ రఫీక్, భువనేశ్వర్ ఆచార్య, కప్పగల్ శారద, స్కూలు కరెస్పాడెంట్ పరమేశ్వరప్ప, తిప్పన్న, గంగ, ఇషాక్, ఇతర సిబ్బంది తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం

అంజన్నకు ప్రత్యేక పూజలు

అగళి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడిపల్లి గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాల్మీకి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, టీడీపీ నాయకుడు రమేష్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఆకుపూజ, కుంకుమార్చన తదితర పూజల అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి స్వామివారిని దర్శించుకున్నారు. ఆయన వెంట జడ్పీటీసీ ఉమేష్ తదితరులు పాలొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.ఎస్. శంకరనారాయణ కాంపౌండ్...

కనుపర్తి వరలక్ష్మమ్మ (జయంతి)



ప్రముఖ రచయిత్రి కనుపర్తి వరలక్ష్మమ్మ 1896 అక్టోబరు 6న బాపట్లలో జన్మించారు. మద్రాసు, విజయవాడ ఆకాశవాణి కార్యక్రమాల్లో పాల్గొన్న తొలి మహిళగా గుర్తింపు పొందారు. 'నమో ఆంధ్ర మాత' పేరుతో గేయాలు రాశా రు. పిల్లల పాటలు, నవలలు, పిట్టకథలు, జీవితచరిత్రలు, కథలు అనేక ప్రక్రియల్లో రచనలు చేశా రు. ఆమె కథలు తమిళ, కన్నడ, హిందీ భాషలలోకి అనువాదమయ్యాయి. బాలిక అభ్యున్నతికోసం బాపట్లలో 'స్త్రీ హితైషిణి మండలి' స్థాపించి ద్వారా సమాజసేవ చేశారు. ప్రపంచ తెలుగు మహాసభలో సన్మానం పొందిన రచయిత్రి. 1978 ఆగస్టు 13న కన్నుమూశారు.

టీఎన్ కృష్ణన్ (జయంతి)



త్రిపునితుర నారాయణయ్యర్ కృష్ణన్ 1928 అక్టోబరు 6న కేరళ రాష్ట్రం ఎర్నాకులం జిల్లాలో జన్మించారు. లాల్గుడి జయరామన్, ఎంఎస్ గోపాలకృష్ణన్తో కలిసి ముగ్గురూ కర్ణాటక సంగీతంలో వయోలిన్ త్రయంగా పేరొందారు. చెన్నైలోని మ్యూజిక్ కాలేజీలో ప్రొఫెసర్గా, ఢిల్లీ యూనివర్సిటీలో డీన్ ఆఫ్ స్కూల్ ఆఫ్ మ్యూజిక్గా వ్యవహరించారు. పద్మశ్రీ, పద్మభూషణ్, సంగీత నాటక అకాడమీ, సంగీత కళానిధి, సంగీత కళాశిఖామణి వంటి పురస్కారాలు అందుకున్నారు. 2020 నవంబరు 2న కన్నుమూశారు.

వినోద్ఖన్నా (జయంతి)



హిందీ సినీరంగంలో పేరొందిన నటుడు వినోద్ఖన్నా 1946 అక్టోబరు 6న పెషావర్ లో జన్మించారు. నిర్మాతగా, రాజకీయనాయకుడిగానూ రాణించారు. 1970, 80లలో అత్యధిక రెమ్యూనరేషన్ నటుడిగా నిలిచారు. ఫిల్మ్ఫేర్, జీవితసాఫల్య పురస్కారాలు, ఇతర అవార్డులు పొందారు. ప్రధాని వాజ్పేయి కేబినెట్లో సాంస్కృతిక, పర్యాటకశాఖ మంత్రిగా, విదేశీ వ్యవహారాలశాఖ మంత్రిగా వ్యవహరించారు. 2017 ఏప్రిల్ 27న కన్నుమూశారు. మరణానంతరం కేంద్రప్రభుత్వం 2018లో దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ప్రకటించింది.

రాజారెడ్డి (పుట్టినరోజు)



పద్మభూషణ్ గ్రహీత రాజారెడ్డి 1943 అక్టోబరు 6న జన్మించారు. కూచిపూడి నృత్యకారుడు, గురువు, కొరియోగ్రాఫర్. భార్య రాధారెడ్డితో కలిసి వందలసార్లు దేశ, విదేశాలలో అంతర్జాతీయ నృత్య ప్రదర్శనలు చేశారు. దంపతులు ఇద్దరూ ఒకేసారి పద్మశ్రీ, పద్మభూషణ్ పురస్కారాలు అందుకోవడం విశేషం. సంగీత నాటక అకాడమీ పురస్కారాలు, గౌరవ డాక్టరేట్లు అందాయి. న్యూఢిల్లీలో 'నాట్యతరంగిణి' సంస్థ ద్వారా శాస్త్రీయనృత్యం, సంగీతం, యోగా నేర్పిస్తున్నారు. కాగా కుమార్తెలు కూడా కూచిపూడి నృత్యంలో రాణిస్తున్నారు.

9 నుంచి హాసనాంబదేవి దర్శనం

బెంగళూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏడాదికోసారి మాత్రమే తెరువబడే హాసనాంబదేవి ఆలయం వద్ద భారీగా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈనెల 9వ తేదీ గురువారం హాసనాంబ దేవి ఆలయం తెరుచుకోనుంది. 13 రోజుల పాటు భక్తులకు దర్శనం చేసుకునే అవకాశం ఉంటుంది. సాధారణంగా ఏడాదికి ఒకసారి మాత్రమే తెరువబడే హాసనాంబ దేవి ఆలయ దర్శనం కోసం స్థానికులే కాకుండా రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన భక్తులు వస్తుంటారు. మహారాష్ట్ర, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా భక్తులు వచ్చి దర్శనం చేసుకుంటారు. ఇలా భారీగా వచ్చే భక్తుల కోసం ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేస్తున్నారు. కొవిడ్ కాలంలో మాత్రమే హాసనాంబ దేవి దర్శనంకు అవకాశం కల్పించలేదు. నగరమంతటా భారీ స్క్రీన్లు ఏర్పాటు చేసి లైవ్గా ప్రసారం చేశారు. హాసనాంబ ఆలయం తెరిచే వేళ హాసనాంబ జాతర కూడా జరుగుతుంది. కాగా ఆలయం తెరువకముందే పలు ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం, ఆలయ పాలకవర్గం చేస్తుంది. అందులో భాగంగా 20లక్షలకు కొనుగోలు చేసేంతటి సీసీ కెమెరాలకు రూ.60లక్షలు చెల్లించి బాడుగకు తీసుకుంటున్నారని స్థానిక న్యాయవాది, బీజేపీ నేత దేవరాజేగౌడ ఆరోపించారు. టెంట్లు, భారీ కేడ్లు ఏర్పాటు చేసేందుకు 74లక్షలతో పనులు చేసేవారిని కాదని అధికంగా పలికేవారికి టెండర్ దాఖలు చేసిన టెండర్ దారుడికి పనులు కట్టబెట్టారన్నారు. గోల్డ్ పాస్ పేరుతోను మోసానికి పాల్పడేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు. కాగా జిల్లా ఇన్చార్జ్ మంత్రి కృష్ణబైరేగౌడ ఆలయ ఏర్పాట్లపై ఇప్పటికే మూడుసార్లు సమీక్ష జరిపారు. మరో రెండురోజులలో జిల్లాధికారులతో సమీక్ష జరిపి ఏర్పాట్లను పర్యవేక్షించడంచనున్నారు సమాచారం.



హాసనాంబ దేవి ఆలయం

చెరువుల అభివృద్ధితోనే గ్రామాల మనుగడ

- ఆరోహణ గ్రామీణాభివృద్ధి కార్యదర్శి ఎస్ ఆశా



సదస్సులో పాల్గొన్న సంస్థ ప్రతినిధులు

బెంగళూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): చెరువుల అభివృద్ధి ద్వారానే గ్రామాల మనుగడ సాధ్యమని ఆరోహణ గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యదర్శి ఎస్. ఆశా అభిప్రాయపడ్డారు. ఆదివారం మిథిక్ సొసైటీలో చెరువుల గ్రామీణ జీవజలాలు అనే అంశంపై ప్రత్యేక సమావేశం జరిగింది. చరిత్రకారులు, రచయిత వేమగల్ సోమశేఖర్తో పాటు శాసనసభ గెజిటెడ్ అధికారి చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆశా మాట్లాడుతూ బెంగళూరులోని పలు ఐటీ సంస్థల ఉద్యోగులను చెరువుల అభివృద్ధి పనులలో భాగస్వాములను చేశామన్నారు. వారంతంలో ఉద్యోగులు శ్రమదానంలో పాల్గొంటున్నారన్నారు. ప్రధానంగా చెరువులు, పాడుబడిన బావులలో పూడికతీతతో పాటు గట్లు వెంబడి మొక్కలు ఇతరత్రా చెట్లను నాటుతున్నామన్నారు. కేవలం మొక్కలను నాటడమే కాకుండా వాటి సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు.

చెరువులలో పూడిక పేరుకుపోవడం ద్వారా నీటి నిలువ ఏటా తగ్గిపోతోందన్నారు. వేమగల్ సోమశేఖర్ అభిప్రాయం మేరకు రెండు దశాబ్దాలకు పైగా మంచి వర్షాలు లేక కోలార్, చిక్కబళ్ళాపుర జిల్లాలు పరిస్థితి మారిపోయిందన్నారు. ఇటీవల నాలుగైదేళ్లుగా వర్షాలతో పాటు ఎత్తిపోతల ద్వారా కోలార్ జిల్లాకు నీటి మళ్లింపు జరుగుతోందని తద్వారా నిరంతరం చెరువులకు జలకళ వచ్చిందన్నారు. దీంతో భూగర్భజలం పెరిగిందన్నారు. యువత ఉద్యోగాల పేరుతో నగరాలలో ఉండటంలో తప్పులేదని కానీ గ్రామీణ ప్రాంతాలలో వారి సేవలు అవసరమన్నారు.

చదువును జీవితకాలం కొనసాగించాలి

- విద్యార్థులకు విద్యాశాఖ డైరెక్టర్ శోభ పిలుపు



పట్టాలు ప్రదానం చేస్తున్న కళాశాల డైరెక్టర్ శోభ

బెంగళూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): చదువు కొనసాగించాలని కళాశాల విద్యాశాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ శోభా. జి అభిప్రాయపడ్డారు. బీఎంఎస్ కళాశాలలో ఆదివారం స్నాతకోత్సవం జరిగింది. ఈసందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి శోభా మాట్లాడుతూ చదువు, నైపుణ్యత సాధించడమనేది నిరంతరమైనదన్నారు. డిగ్రీ ముగిసిందని భావించరాదని ఇప్పటి నుంచే విద్యార్థులలో కొత్త ఆలోచనలు రావాలన్నారు. ఉన్నత విద్యాతో పాటు పరిశోధనలకు ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం స్టార్టప్ యుగం నడుస్తోందని ఆదిశగాను యువ విద్యార్థులు ప్రయత్నించాలన్నారు. జీవితంలో మానవీయ విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. 700ల మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. బీఎంఎస్ పాలకమండలి ట్రస్టీ అవిరామ్శర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ రమకుమార్ ఎన్ డాక్టర్ గీతాశ్రీ, సుమంగళతో పాటు పాలకమండలి సభ్యులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పల్లెకు అందని వైద్యం

నిరుపయోగంగా విలేజ్ హెల్త్ క్లినిక్లు

బొమ్మనహాళ్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో మండలంలో 15 విలేజ్ హెల్త్ క్లినిక్లకు గాను 12 క్లినిక్లకు భవనాలను ఏర్పాటు చేసింది. శ్రీధరఘట్ట, ఉద్దేహాళ్, నేమకల్లులో భవనాలను నిర్మించలేదు. ఏర్పాటు చేసిన 12 విలేజ్ హెల్త్ క్లినిక్లో సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. ఎవరూ... ఎప్పుడు... వచ్చి విధులకు వస్తారో తెలిక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని విలేజ్ హెల్త్ క్లినిక్లను ఒక్కోరోజు అసలు తెరవడమే లేదు. కొన్ని గ్రామాల్లో సిబ్బంది హాజరుకాకుండా ఆశా కార్యకర్తలతో క్లినిక్లను తెరిపించి మమ అనిపిస్తున్నారనే ఆరోపణలున్నాయి. సిబ్బంది నామమాత్రంగా విధులకు హాజరవుతున్నారు. జిల్లా కేంద్రానికి ఈ మండలం 100 కిలోమీటర్ దూరంలో ఉండడంతో ఉన్నతాధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. పీహెచ్సీ వైద్యులు కూడా పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడింది. గ్రామాల్లో వైద్య సేవలు అందకపోవడంతో గ్రామస్తులు ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. అత్యవసర వైద్యం కోసం పట్టణాలకు పరుగులు తీస్తున్నారు. దీంతో చిన్నపాటి జ్వరాలకు గ్రామస్తులు ఉరవకొండ, బళ్లారి, రూపాన గుడి ప్రాంతాలకు వెళ్తున్నారు. కాగా, దేవగిరిలో ఎంఎల్హెచ్పీ, ఏఎన్ఎం, కురువల్లిలో ఏఎన్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి.



మూసివున్న గోనేహాళ్లోని విలేజ్ క్లినిక్

భగవాన్ జెండా పేరుతో పార్టీ

- బుల్డోజర్ ద్వారానే పాలన: బసవనగౌడ పాటిల్ యత్నాళ్



బెంగళూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ కాలంగా బీజేపీలో కొనసాగుతూ ఇటీవల సస్పెన్షన్ వేటుకు గురైన విజయపుర ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ మరో సంచలన ప్రకటన చేశారు. బాగల్కోట జిల్లా రబకవిబనహట్టి తాలూకా మద బావి గ్రామంలో జరిగిన ఓ సమావేశంలో శనివారం పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బీజేపీలోకి వాపస్ తీసుకుంటే సరి లేదంటే భగవాన్ జెండా పేరుతోనే రాజకీయ పార్టీని స్థాపిస్తాననని సవాల్ విసిరారు. సొంతంగానే అధికారంలోకి వస్తే ఉత్తర ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ తరహాలోనే బుల్డోజర్ ద్వారానే ప్రభుత్వ పాలన సాగిస్తానన్నారు. మూడు దశాబ్దాల కాలంగా బీజేపీలో ఉన్నట్లు తెలిపారు. కేంద్రమంత్రిగా, రాష్ట్రంలో ఎమ్మెల్యేగా ఓటమి లేకుండా కొనసాగుతున్నానన్నారు. ఎక్కడా పార్టీకి చెడ్డపేరు తీసుకువచ్చే పనిచేయలేదన్నారు. కానీ కొందరు దుష్టశక్తులు పార్టీను చెడగొడుతుంటే చూస్తూ సహించలేక విమర్శలు చేసినట్లు తెలిపారు. ఇకపై డబ్బుల రాజకీయం రాష్ట్రంలో సాగదన్నారు. డబ్బులిస్తే గెలిచేవారు ప్రజాసేవ చేయరన్నారు. నేను అధికారంలోకి వస్తే 11 బుల్డోజర్లకు పూజ చేసి ప్రమాణస్వీకారం చేస్తానన్నారు. బుల్డోజర్లు అభివృద్ధికి సంకేతాలుగా అభివర్ణించారు. ఇటీవలే సీఎం సిద్దరామయ్య అసెంబ్లీలో నిన్ను బీజేపీ నుంచి తొలగించారని ఎద్దేవా చేశారని అందుకు దీటుగా మీకు జేడీఎస్ నుంచి దేవెగౌడ తొలగించినందుకే కాంగ్రెస్లోకి వచ్చి ముఖ్యమంత్రి అయ్యారని నేను కూడా అదే స్థాయికి వస్తానని సవాల్ విసిరానన్నారు. యత్నాళ్ హిందుత్వ వాదిగా ముద్రపడిన ఫైర్బ్రాండ్ నాయకుడు. పార్టీలో రెబల్గా మారినందుకు వేటువేశారు.

బంగారం కొనుగోలులో జాగ్రత్తలు తప్పనిసరి

బెంగళూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): బంగారం ధరలు అమాంతం పెరిగిపోతున్నాయని కొనుగోళ్లలోను జాగ్రత్తలు పాటించాల్సిందేనని ప్రముఖ నటుడు రమేష్ అరవింద్ అభిప్రాయపడ్డారు. ఆదివారం మణిపాల్ సెంటర్లో ముళియ గోల్డ్ అండ్ డైమండ్ దుకాణం ప్రారంభించారు. ఈసందర్భంగా రమేష్ అరవింద్ మాట్లాడుతూ 81ఏళ్లుగా బంగారం వ్యాపారంలో ఉన్న సంస్థ మరోశాఖను తెరవడం ప్రగా మరింతమందికి చేరువ అవుతోందన్నారు. ఒకే రోజున వెయ్యిమంది వినియోగదారులను స్వాగతించే విధంగా ప్రారంభించారు. ఛైర్మన్ కేశవప్రసాద్ మాట్లాడుతూ సుదీర్ఘకాలం వ్యాపార పరంపరలో ఉండడంకు నమ్మకమే కారణమన్నారు. సుబ్రమణ్యభట్, వేణుశర్మ, బడక్కిల ప్రదీప్, శ్రీకృష్ణ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో అక్కాతమ్ముడి మృతి

- రెండేళ్ల చిన్నారికి తీవ్రగాయాలు



బోల్తాపడిన కారు

రాయచూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మాన్వి తాలూకా పోత్నాళ్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్పై వెళుతున్న అక్కా, తమ్ముడు మృతిచెందగా, రెండేళ్ల బాలిక గౌతమి తీవ్రంగా గాయపడింది. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు కడగిగుడ్డ గ్రామానికి చెందిన శేఖరప్ప(25) సోదరి మరియమ్మ(28), ఆమె రెండేళ్ల కూతురుని బైక్పై ఎక్కించుకుని స్వగ్రామానికి వెళుతుండగా పోత్నాళ్ సమీపంలోని దేశాయి క్యాంప్ సమీపంలో రోడ్డు మలుపుతున్న కారు వీరి బైక్ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్పై నుంచి పడిన అక్కాతమ్ముడు అక్కడికక్కడే మృతిచెందారు. వీరి బైక్ను ఢీకొట్టిన కారు వేగంగా వెళుతూ మరో కారును ఢీకొట్టడంతో ఆ కారు బోల్తాపడింది. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ప్రమాదానికి కారణమైన కారు నంబరు ఆధారంగా నిందితుల కోసం గాలింపు చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. గాయపడిన రెండేళ్ల బాలిక గౌతమిని సింధనూరు ఆస్పత్రికి తరలించారు.

సఫాయి కార్మికులకు వసతి కల్పించాలి

- జిల్లా అధికారి నితీశ్



సమీక్షలో మాట్లాడుతున్న జిల్లాధికారి నితీశ్

రాయచూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పని చేస్తున్న సఫాయి కార్మికులకు వసతి సౌకర్యంతో పాటు ప్రభుత్వ పరంగా లభించే అన్ని రకాల సౌకర్యాలు అందేలా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లాధికారి కె. నితీశ్ ఆదేశించారు. సఫాయి కార్మికుల సౌకర్యాలు ప్రభుత్వ పరంగా వారికి అదే తోడ్పాటు తదితర అంశాలకు సంబంధించి జిల్లాధికారి కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన జిల్లాలోని కార్మికులను గుర్తించి వారికి సకాలంలో వేతనాలు అందించాలన్నారు. ప్రభుత్వ పరంగా ఇతర అన్ని రకాల ప్రోత్సాహకాలు ఎప్పటికప్పుడు అందేలా సంబంధిత శాఖ అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు.

ఈతకు వెళ్లి ఇద్దరు యువకుల గల్లంతు

- ఒకరి మృతదేహం లభ్యం, మరొకరి కోసం గాలింపు

రాయచూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మస్కి తాలూకా ముదగల్ పట్టణ సమీపంలో ఈత కోసం వెళ్లిన ఇద్దరు యువకులు కాలువలో గల్లంతయ్యారు. గల్లంతయిన ఇద్దరు యువకులు ముదగల్ పట్టణానికి చెందిన యల్లాలింగ(28), వెంకటేశ్(27)లుగా స్థానికులు తెలిపారు. వీరిద్దరు ముదగల్ నుంచి మస్కికి సినిమా చూసేందుకు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో రోడ్డు సమీపంలోని కాలువలోకి ఈత కోసం వెళ్లారు. నీటి ఉధృతి అధికంగా ఉండడంతో ఇద్దరు ప్రమాదవశాత్తు నీటిలో కొట్టుకుపోయారు. విషయం స్థానికుల నుంచి తెలుసుకున్న మస్కి పోలీసులు అగ్నిమాపక సిబ్బంది సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. ఒకరి మృతదేహం లభ్యంకాగా మరొకరి కోసం గాలింపు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరిహారం అందజేత



బాధిత కుటుంబానికి పరిహారం చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే దద్దల బసనగౌడ

రాయచూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు గురై మృతి చెందిన బాధితుడి కుటుంబానికి వాల్మీకి అభివృద్ధి మండలి అధ్యక్షుడు, రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడ రూ.5 లక్షల పరిహారం చెక్కును అందజేశారు. ఇటీవల కురిసిన వర్షంతో పాటు పిడుగుపాటుకు గురై రాయచూరు తాలూకాలోని తుంగభద్ర గ్రామానికి చెందిన దేవప్ప మృతిచెందిన విషయం తెలిసిందే. ఆ కుటుంబాన్ని శనివారం సాయంత్రం పరామర్శించిన రూరల్ ఎమ్మెల్యే ప్రభుత్వం తరపున అందిన రూ.5 లక్షల పరిహారం చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. ప్రభుత్వం అండగా ఉంటుందని బాధితులకు భరోసా కల్పించారు.

జూదరుల అరెస్ట్

డీ.హీరేహాళ్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడేకలపల్లి గ్రామ శివారు ప్రాంతంలోని ముళ్ల పొదల్లో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్రెడ్డి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.18,450 స్వాధీనం చేసుకున్నామని, వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

సైఫుల్లా క్రికెట్ టోర్నీ విజేత ఆర్టీటీ



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న నిర్వాహకులు

కణేకల్లు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పదిరోజులుగా నిర్వహిస్తున్న సైఫుల్లా క్రికెట్ టోర్నీలో ఆర్టీటీ జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్మ్యాచ్లో కణేకల్లు ఆర్టీటీ జట్టు, కొండాపురం జట్టు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఆర్టీటీ జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 123 పరుగులు చేయగా.. అనంతరం బ్యాటింగ్ చేసిన కొండాపురం జట్టు 9 వికెట్లు కోల్పోయి 98 పరుగులు మాత్రమే చేసింది. విజేత ఆర్టీటీ జట్టుకు రూ. 20 వేలు, రన్నర్ కొండాపురం జట్టుకు రూ. 10 వేలతో పాటు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో వీఓ గోపాల్రెడ్డి, ఉపసర్పంచ్ నబీసాబ్, టీటీ సర్వాస్, మోహన్, క్రీడాకారులు రాజేష్, పురుషో త్తం, నిర్వాహకులు మణికంఠ, సాయిరెడ్డి, నితీష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

బకాయిలు ఇప్పించాలని పెన్షనర్ల వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న పెన్షనర్లు

తాడిపత్రి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): తమకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలను వచ్చేలా చర్యలు తీసుకోవాలని పట్టణంలోని పెన్షనర్లు ఎమ్మెల్యే జేసీ అస్మిత్రెడ్డికి ఆదివారం వినతి పత్రం అందజేశారు. పెన్షనర్లకు అడిషనల్ క్వాంటం పెంపు, డీఏ బకాయిలు చెల్లింపు, పీఆర్సీ వెంటనే ప్రకటించాలని, పీఆర్ గురించి ప్రకటన, హెల్త్ కార్పొరేషన్ ఏర్పాటు, ఐహెచ్ఎస్ పరిమితి రూ.5లక్షలు పెంచాలని కోరారు. ఎమ్మెల్యే స్పందించి సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్తానన్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు సత్యప్రకాష్రెడ్డి, వీరారెడ్డి, నారాయణస్వామి, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక తరలింపు

నంబర్ ప్లేటులేని ట్రాక్టర్లలో రవాణా

విడపనకల్లు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంత మంది టీడీపీ, వైసీపీ నాయకులు కలిసి ఇసుక అక్రమ వ్యాపారానికి తెరలేపారు. రోజుకు రూ. లక్షలు గడిస్తున్నారు. బొమ్మనహాళ్ మండలం బొల్లనగుడ్డం, కందేపల్లి, కణేకల్లు మండలంలోని పలు ప్రాంతాల నుంచి రోజూ వేలు, రాత్రి అనే తేడాలేకుండా అక్రమంగా ఇసుకను వందలాది ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ఈ ఇసుక ట్రాక్టర్లు పా ల్వాయి, కరకముక్కల మీదుగా మండలానికి చేరుకుంటున్నాయి. ఏ ఒక్క ట్రాక్టర్కూ నం బరు ప్లేటు ఉండదు. మండల అధికారుల కళ్లు ఎదుటే ఇసుకను అక్రమంగా రవాణా చే స్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇక్కడి నుంచి వివిధ గ్రామాలకు పక్కనే ఉన్న కర్ణాటకకు ఆ ఇసుకను తరలిస్తున్నారు.



నంబరు ప్లేటులేని ట్రాక్టర్లో తరలిస్తున్న ఇసుక